## అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు




**ఏలూరు,జూన్ 17 పెన్ పవర్:** జిల్లా కలెక్టరేట్ లోని ఏలూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏలూరు రెవిన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, ఆధ్వర్యంలో బుధవారం ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు మరియు అంగన్వాడీ సహాయకురాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద తెలిపారు. ఏలూరు, భీమడోలు, కైకలూరు, పెదపాడు ప్రాజెక్టులలో మొత్తం 8 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 101 మంది అంగన్వాడీ సహాయకురాలు, 1 మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు (మొత్తం 110 పోస్టులకు)లకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 270 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనారు.కార్యక్రమంలో ఏలూరు ప్రాజెక్ట్ సిడిపివో ఎ. పద్మావతి, భీమడోలు ప్రాజెక్ట్ సిడిపివో రాజశేఖర్, కైకలూరు ప్రాజెక్ట్ సిడిపివో దీప్తి, పెదపాడు ప్రాజెక్ట్ సిడిపివో విజయకుమారి, డా. రోహిత్ పాల్గొన్నారు.


# పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి







## పలుకుబడి గలవారికే నే ..? సామాన్యులకు అందజేయరా ..?

### -పంచాయితీ కార్యాలయంలో పంపిణీ చేయని డస్ట్‌బిన్‌లు

**ఏలూరు జూన్ 17 పెన్‌పవర్** : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఇంటింటా పారిశుధ్య కార్మికులు గ్రామాలలో తడి పొడి చెత్త పేకరణకు మండల పరిషత్ కార్యాలయాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి డస్ట్ బిన్‌లు సరఫరా చేసింది.వాటిని గ్రామ పంచాయితీలకు పంపిణీ చేసిన మండల అధికారులు అవి సక్రమంగా చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారా..? పంపిణీ చేయకుండా కార్యాలయంలోనే ఉంచి పలుకుబడి గల వారికి పంపిణీ చేస్తున్నారా..? అనే పరిశీలన ఉండటం లేదు.మండల ప్రత్యేక అధికారుల గానీ, పర్యవేక్షణాధికారులు గానీ వాటిపై పర్యవేక్షణ లేక పోవడంతో ఇంటింటా చెత్త సేకరణ డస్ట్ బిన్‌లు పెదపాడు మండలంలోని పంచాయితీ కార్యాలయాల గడప దాటటంలేదు.చెత్త సేకరించే డస్ట్ బిన్‌లు అందక మహిళలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్‌లపై పడేసే పరిస్థితి ఏర్పడింది. పర్యవేక్షణాధికారులు గ్రామ పంచాయితీ కార్యాలయాల పర్యటన చేసినప్పుడు ఆ పంచాయితీని సందర్శించినట్లు తమ టూర్‌డైరీలో రాసి సంతకాలు చేపి వెళిపోతున్నారే తప్పా, కార్యాలయాల్లో పంపిణీ చేయకుండా ఉన్న డస్ట్‌బిన్ లపై దృష్టి సారించడంలేదు.మండల పరిషత్ ప్రత్యేక అధికారి ఎప్పుడూ తనకు సమావేశాలు ఉన్నాయంటూ మండలంలోని గ్రామాలలో సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు మండల వ్యాప్తంగా వ్యక్తమౌతున్నాయి.మండలంలోని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో పంపిణీ చేయకుండా ఉన్న డస్ట్‌బిన్‌లు చెత్త సేకరణకు ఉపియోగ పడి కూటమి ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలా ప్రత్యేక అధికారి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## రాజకీయాలకతీతంగా ప్రజాసేవ చేసిన కందుల శ్రీనివాస్ :- ఐ.వి.




**ఎటపాక పెన్ పవర్ జూన్ 17:** రాజకీయాలకతీతంగా నిస్వార్థంగా ప్రజాసేవ, ప్రజా పోరాటాలు చేసిన మనిషి కందుల శ్రీనివాస్ అని ఐ వి అన్నారు. అమరజీవి కామ్రేడ్ కందుల శ్రీనివాస్ 5వ వర్ధంతి కార్యక్రమం నందిగామ సెంటర్లో కందుల శ్రీనివాస్ స్తూపం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐవి, శాఖ కార్యదర్శి కందుల సతీష్ లు కందుల శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముందుగా స్తూపం వద్ద పార్టీ జెండాను సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పులుసు సూర్యనారాయణ ఎగరేశారు. అనంతరం ఐ.వి. మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడటం కోసం కరోనా ను సైతం లెక్కచేయకుండా ప్రజా సేవ చేసి, అదే కరోనాకు బలి అయిన నిస్వార్ధ జీవి, త్యాగశీలి కందుల శ్రీనివాస్ అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజా ప్రతినిధులను గాని, ప్రభుత్వ అధికారులను గాని నిలదీసి ప్రజల కొరకు పని చేసిన ప్రజల మనిషి కందుల శ్రీనివాస్ అని ఐ.వి. అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శివర్గ సభ్యులు పులుసు బాలకృష్ణ, స్థానిక సిపిఎం పార్టీ నాయకులు పులుసు సత్యనారాయణ, పులుసు కోటేశ్వరరావు, జంగిలి రాము మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పనిచేయాలి

### కలెక్టర్ దినేష్ కుమార్



**చింతూరు, పెన్ పవర్, జూన్ 17:** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కార చర్యలు చేపడుతున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం చింతూరులోని ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొత్తం 99 దరఖాస్తులు అందాయని తెలిపారు. భూ వివాదాలు, రహదారులు, విద్య, సంక్షేమం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్‌లో భాగంగా యాటపాక మండలం గుండాల కాలనీలోని సర్వే నంబర్ 153/1లో ఉన్న 1.67 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించాలని పేరాల వెంకటేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. అలాగే చింతూరు మండలం గూడూరు పరిధిలోని తూలుగొండ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ పిల్లలకు గ్రామ పాఠశాలలోనే విద్యను కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా చింతూరు మండలంలోని చదలవాడ, గుమ్మళ్లకోట, చేలూరు, మిట్టవాడ గ్రామాలకు బీటీ రహదారి నిర్మాణం చేపట్టేందుకు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని గ్రామస్తులు దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ రామ తులసి, డీఎంఅండ్ హెచ్‌ఓ పి. సరిత, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, విద్యాశాఖ అధికారి వై. మల్లేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవులి.

* జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

**ఏలూరు, జూన్ 17 పెన్ పవర్** :జిల్లాలో గర్భస్థశిశు లింగనిర్ధారణ పరీక్షలను కట్టడి చెయ్యడానికి కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం "పిసిడ పిఎన్‌డిటి యాక్టు అమలు మరియు సరోగసీ చట్టం కమిటీ అమలుపై" సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అమలులో ఉన్న పిఎన్‌డిటి చట్టాలుపై మరింత పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో వైద్యసంబంధిత ఫిర్యాదులు,అక్రమ కార్యకలాపాలుపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీనెంబరు 1800- 233-2447 ను విస్తృతంగా ప్రచారం చెయ్యాలని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లాలో తరచూ డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని, ప్రైవేటు స్కానింగు కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీలు చేసి నిబంధనలు అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపులను తనిఖీ చెయ్యాలని, పూర్తి నివేదికలనుఅందించాలని సహాయ ఔషధ నియంత్రణ అధికారిని జిల్లా కలెక్టరు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.యు.శోభ, జిల్లా వైద్యసేవలు సమన్వయ అధికారి డా.సి.హెచ్.బేబీ కమల, గైనకాల జిస్ట్ డా.భవాని, శిశువైద్య నిపుణురాలు డా.ప్రియదర్శిని, సహాయ ఔషధ నియంత్రణ అధికారి చక్రధర్, వివిధ శాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల్లో అక్షరాలు కరువు...

**ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సౌకర్యాలు ఉన్నప్పటికీ నాణ్యమైన విద్యపై విశ్వాసం తగ్గడంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు పరుగులు పెడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు, బలవంతపు కొనుగోళ్లతో కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**ఒకవైపు ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతుండగా, మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘనలు, అరకొర వసతులు, అధిక ఫీజుల వసూళ్లు కొనసాగుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.**

**పెన్ పవర్ ప్రత్యేక కథనం, తూర్పు గోదావరి/సీతానగరం, జూన్ 17:**
వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో విద్యార్థుల కంటే ఎక్కువగా తల్లిదండ్రులలో ఆందోళన నెలకొంది. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలనే ఆశతో పేద, మధ్యతరగతి కుటుంబాలు సైతం ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గ చూపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ విద్యా ప్రమాణాలపై ఉన్న సందేహాలు తల్లిదండ్రులను ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతికే పరిస్థితికి నెట్టేశాయి.

### ప్రైవేటు బడుల వైపు తల్లిదండ్రుల పరుగులు

రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, రైతు కుటుంబాలు తమ పిల్లలు ఉన్నత స్థాయికి చేరాలంటే నాణ్యమైన విద్యే మార్గమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ ఆదాయానికి మించి ఖర్చు అయినా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు అప్పులు చేసి, మరికొందరు ఇతర అవసరాలను వదులుకుని పిల్లల చదువుల కోసం నిధులు సమకూర్చుతున్నారు.

### విద్యాసంస్థలా... వ్యాపార కేంద్రాలా?

విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నారనే ఆరోపణలు ప్రైవేటు పాఠశాలలపై వినిపిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో అదనపు వసూళ్లు తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యాసంస్థలు విద్య బోధన కంటే ఆదాయ వనరులపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### పుస్తకాల నుంచి యూనిఫారాల వరకు బలవంతపు కొనుగోళ్లు

అనేక ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు, యూనిఫారాలు, షూస్ వంటి వస్తువులను తమ వద్దనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే వస్తువులను అధిక ధరలకు విక్రయించడం ద్వారా అదనపు లాభాలు పొందుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### 25 శాతం ఉచిత సీట్ల నిబంధన అమలు ఎక్కడ?

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, ఆ నిబంధన అమలు విషయంలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చాలా చోట్ల ఈ నిబంధన కేవలం కాగితాలకే పరిమితమైందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు

కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తగిన తరగతి గదులు, ఆట స్థలాలు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు లేకపోయినా విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్చుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిమిత స్థలంలో ఎక్కువ మంది విద్యార్థులను కూర్చోబెట్టడం వల్ల వారి శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రభావం పడుతోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

### ప్రభుత్వ విద్యపై విశ్వాసం ఎందుకు తగ్గింది?

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు వంటి పథకాలు అమలవుతున్నప్పటికీ, విద్యా ప్రమాణాలపై ప్రజల్లో పూర్తి స్థాయి నమ్మకం ఏర్పడలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులే తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించడం కూడా ఈ చర్చకు మరింత బలం చేకూరుస్తోంది.

అధికారుల జోక్యం కోరుతున్న తల్లిదండ్రులు

ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ, నిబంధనల అమలు, మౌలిక వసతుల పర్యవేక్షణపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంచి, ఆధునిక బోధన పద్ధతులు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ బడులు నాణ్యమైన విద్యకు చిరునామాగా మారితేనే ప్రైవేటు విద్యాసంస్థలపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## చింతూరులో ఉచిత వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరం ప్రారంభం



**చింతూరు, పెన్ పవర్, జూన్ 17:** గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో సుశ్రుత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నౌక్వాల్ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాల్లో నివసించే ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలు సహకరించడం అభినందనీయమన్నారు. వెరికోస్ వెయిన్స్, వాచిన నరాలు, కాళ్లపై పుండ్లు, వాపులు, కాళ్ల వేళ్లకు గ్యాంగ్రిన్, సన్నని నరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిబిరం ద్వారా సుమారు రూ.5 వేల విలువైన వాస్కులర్ సర్జన్ కన్సల్టేషన్, కలర్ డోప్లర్ స్క్రీనింగ్ పరీక్షలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ దివ్య, వైద్యాధికారులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ స్పందన, డాక్టర్ చలపతి, డాక్టర్ రమణారావు, డాక్టర్ శశికళతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


## 18 ఏళ్లు నిండిన యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

**ఇంటింటి ఓటర్ల సర్వేను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 17 :** పోలవరం జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ కార్డుల కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం రంపచోడవరం పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల సర్వే, ఎన్రోల్మెంట్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా మరణించిన, నకిలీ లేదా అర్హత లేని ఓటర్ల పేర్లను తొలగించి, కొత్తగా అర్హత సాధించిన ఓటర్లను జాబితాలో చేర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, జాబితాలో ఉన్న పొరపాట్లను సరిదిద్దుతున్నారని చెప్పారు. పోలవరం జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే సర్వే నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్. బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్లు సునీత, జిలాని, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## జల ధారా పనులు జూన్ 30లోగా పూర్తి చెయ్యాలి. అధికారులకు ఎంపీడీవో ఆదేశాలు..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 17;** వికసిత భారత గ్యారంటీ ఫర్ రోజు గర్ అండ్ అజీవ్ క మిషన్( గ్రామీణ) కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో కుమార్ నిర్వహించారు. మండలంలో 22 గ్రామపంచాయితీల లో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కొత్తగా శాంక్షన్ అయినా 101 జలధార పనులను ప్రారంభం అయినవి అని ఎంపీడీవో తెలిపారు. ఈ పనులు జూన్ 30 లోపుపూర్తి చేయాలని మరియు నాణ్యత ప్రమాణాలు ప్రకారం పనిచేయించాలని , వి బి జి ఆర్ ఏ ఎం జి జూలై 1 నుండి ప్రారంభం అవుతుందని అందరికీ తెలియచేయాలని మరియు మండలం లోని 8350 యాక్టివ్ జాబ్ కార్డ్స్ పనికి హాజరవ్వాలని,ప్రతీ జాబ్ కార్డ్ 100 రోజులు పూర్తి చేయించాలని,చిన్న సన్నకారు రైతులుప్రతీ ఒక్కరకి పండ్లతోటలు పెంపకం వేయించాలని, మండలానికి ఇచ్చిన 550 ఎకరాలు ఈనెల 30 నాటికి శాంక్షన్ తీసుకుని గుంతలు తీయించాలని అధికారులకు ఎంపీడీవో కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఓ చిరంజీవి రావు , టి ఏ లు, ఎఫ్ ఏ లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేస్తా: ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 17.** పురపాలక సంఘంలో విలువైన సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని, పురపాలక శాఖ మంత్రి నారాయణ తో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.




స్థానిక విడిది కార్యాలయంలో బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని, పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో యంత్రాలను ప్రవేశపెట్టడాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేయటానికి భవిష్యత్తులో కార్మికులు ముందుకు వచ్చే అవకాశం ఉండకపోవచ్చుననే దూర దృష్టితో ప్రభుత్వం ఈ రంగంలో యాంత్రీకరణ చేయాలని ఆలోచన చేస్తుందన్నారు. ఇప్పుడు పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తన బాధ్యత తీసుకుంటానని అన్నారు. కార్మికుల వారసత్వంగా వారి పిల్లలు కూడా ఇదే రంగంలో పని చేయాలని ఎవరూ కోరుకోరని అన్నారు. పారిశుధ్య పనులకు మనుషుల స్థానంలో యంత్రాలవినియోగం ఆధునిక పరిపాలన విధానం అన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న కాలంలోనూ, ఎమ్మెల్యేగా రెండేళ్లలోనూ కార్మికుల శ్రేయస్సు కోసమే కృషి చేశానని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులు పంపిణీ



**సీతానగరం, పెన్ పవర్:17 జూన్ :** ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు యూరియా డిఎపి లాంటి ఎరువులు పంపిణీ చేస్తారని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ. గౌరీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసే రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంటలను విస్తీర్ణం ఆధార్ కార్డు పట్టాదారు పుస్తకాన్ని వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. యాప్ లో వెరిఫికేషన్ చేయించుకున్న రైతుకు మాత్రమే సొసైటీ రైతు సేవా కేంద్రాలు ప్రైవేట్ డీలర్స్ వద్ద యూరియా డిఎపి లాంటి ఎరువులు పొందే అవకాశం ఉందంటున్నారు.

## 32కిలోల గంజాయి పట్టివేత

* నలుగురు వ్యక్తులు అరెస్ట్



**ఏలూరు జూన్ 17 పెన్‌పవర్ :** ఒరిస్సా రాష్ట్రంలో కొనుగోలు చేసి చింతపల్లి-రాజమహేంద్రవరం మీదుగా శ్రీకాళహస్తికి మారుతీ బోలెనో వాహనంలో గంజాయి తరలిస్తున్న 4గురు వ్యక్తును విజయవాడ రహదారి సీతారాంపురం గ్రామ సమీపాన ఏలూరు త్రీటౌన్ పోలీసుల తనిఖీలో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.వారి నుండి 32 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు.నిందితులు చింతపల్లి జిల్లాకు చెందిన ,బోనంగి నాగబాబు,అనకాపల్లి జిల్లా పాయకరావు పేట మండలం నామవరంకు చెందిన మర్లపూడి దుర్గాప్రసాద్,మారవాని పాలెం మండలం భీమబోయిన పాలెం గ్రామానికి చెందిన మురుకుట్టి ఈశ్వర సాయి సతీష్,సీతారామరాజు జిల్లా చింతపల్లి మంలందోని పొలాలు గ్రామానికి చెందిన బోనంగి సత్యనారాయణలపై కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.ఈ తనిఖీలలో త్రీటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్,ఈగల్ టీం సిబ్బంది పాల్గోన్నారు


## ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ రిసార్టులు, మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌కు ఏఎస్పీ వినతి**



**చింతూరు, పెన్ పవర్, జూన్ 17:** ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ కొనసాగుతున్న అక్రమ రిసార్టులు, క్వార్జ్ మైనింగ్ కార్యకలాపాలు, గిరిజన పాఠశాలల విలీనం స్థాయి తగ్గింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంలో ఈ వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కుంజా శ్రీను మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, భూములు, విద్యా అవకాశాల పరిరక్షణలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. మోతుగూడెం, కొల్లూరు గ్రామాల్లో గిరిజన భూముల్లో చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే లగ్జరీ రిసార్టులు, ఎకో రిసార్టులు నిర్మించి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ (ఎల్ టి ఆర్ 1/70) నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఈ రిసార్టులను తొలగించి, భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చింతూరు మండలం గూడూరు అటవీ ప్రాంతంలో ఎలాంటి లీజులు, పర్యావరణ అనుమతులు లేకుండా క్వార్జ్ (తెల్లరాయి) అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ తవ్వకాల వల్ల అడవులు, తాగునీటి వనరులు దెబ్బతింటున్నాయని పేర్కొంటూ, మైనింగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల విలీనం, తరగతుల తగ్గింపు వల్ల గిరిజన విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడి, డ్రాప్‌అవుట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాఠశాలల విలీనం, స్థాయి తగ్గింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కూర చిట్టిబాబు, సంస్థ ప్రతినిధులు, ఆదివాసి యువకులు పాల్గొన్నారు.

## ఆక్వారైతుల కోసం పోరాడాల్సిన బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంది: వడ్డి రఘురామ్ నాయుడు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 17:**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి, మాజీ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటిరోజున తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో రాష్ట్రంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆక్వా రైతు సంఘ నాయకులు, ఫ్రాన్ ఫెడరేషన్ నాయకులతో వారి సమస్యలు గురించి మాట్లాడారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆక్వా రంగం దారుణంగా నష్టపోతుందని వారి సమస్యలు గురించి మాట్లాడారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఆక్వా రంగానికి సంజీవనిలా ఉండేదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారన్నారు. ఆనాడు కార్పొరేషన్ పెట్టకపోయినా, కరెంటు యూనిట్ కి 1.50 పైసలు సబ్సిడీ ఇవ్వకపోయినా ఆక్వా మనుగడ కరువైపోయి ఉండేది అన్నారన్నారన్నారు. 30 ఏళ్లు పైబడి ఆక్వా రంగంలో అనుభవం ఉన్న రైతులు వారి కష్టాలు జగన్మోహన్ రెడ్డికి చెప్పుకున్నారన్నారన్నారు. ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అది భారతదేశంలో ఎక్కడ లేదు అది ఒక్క ఆంధ్రదేశంలోనే పెట్టి గత వైసిపి ప్రభుత్వంలో రైతులను ఆదుకున్న ఘనత జగన్మోహన్ రెడ్డిదన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉంది ఆక్వారంగాన్ని నేనే పైకి తీసు కొచ్చాను అని చెప్పుకునే వాళ్లకి దేశంలో 40 వేల కోట్ల ఎక్స్పోర్ట్ జరుగుతుంటే పట్టించుకునే పరిస్థితి లేదన్నారన్నారు. ఒక్క మన రాష్ట్రంలో ఉండే 36000 కోట్ల రూపాయల ఎగుమతి జరుగుతుంటే ఈ రంగంపై ఎంత శ్రద్ధ చూపించాలి అనేది ఈ ప్రభుత్వానికి తెలియడం లేదు అన్నారు. ఆనాడు 2.75పైసలు పెంచితే రెండువేల కోట్లు జె ట్యాక్స్ క్రింద అందాయని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని, ఈరోజు వనామి కల్చర్ కి 10 రూపాయలు టైగర్ కల్చర్ ఫీడ్ కి 12 రూపాయలు పెంచాలంటే ఇందులో సిబిఎన్ టాక్స్ ఎంత ఉంది లోకేష్ టాక్స్ ఎంత ఇన్ని వేల కోట్లు చేతులు మారాయి ఆక్వారైతులకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందన్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పాలంటే వెంటనే పెంచిన రేట్లు తగ్గించాలన్నారు.

## విద్యానగరి రాజమహేంద్రవరంలో అక్షర శ్రీ జూనియర్ కళాశాల ప్రభంజనం

- తక్కువ ఫీజుతోనే అత్యుత్తమ ర్యాంకులు
- కళాశాల నూతన భవనం ప్రారంభోత్సవం






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 17:**రాజమహేంద్రవరంలో ప్రముఖ విద్యాసంస్థగా పేరొందిన 'అక్షర శ్రీ జూనియర్ కళాశాల' ఈ విద్యాసంవత్సరం ఫలితాలలో సంచలన విజయాన్ని నమోదు చేసింది. సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు భారంగా మారకుండా, అత్యంత తక్కువ ఫీజులతోనే కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తూ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అద్భుతమైన ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దింది. ఈ ఘన విజయం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కళాశాల చైర్మన్ గజేంద్రరావు, డైరెక్టర్ నాగరత్నం ఆధ్వర్యంలో అక్షర శ్రీ జూనియర్ కళాశాలను నూతన భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్షర శ్రీ జూనియర్ కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ... "రాజమహేంద్రవరంలో నాణ్యమైన విద్యను సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంచాలనే ధ్యేయంతోనే ఈ కళాశాలను స్థాపించామని పేర్కొన్నారు. నేడు మా విద్యార్థులు సాధించిన ర్యాంకులు మా ఆశయానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాం అని అన్నారు. తక్కువ ఫీజులే అయినప్పటికీ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రత్యేక శ్రద్ధ, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికే ఈ విజయానికి కారణం అన్నారు. మాపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు, రాత్రింబగళ్లు కష్టపడిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి మా ప్రత్యేక అభినందనలు" అని తెలిపారు. మా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ నిరంతరం కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేయడం వల్ల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పి, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఓ విద్యార్థి తండ్రి మాట్లాడుతూ... "ప్రస్తుతం చదువుల పేరుతో వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న రోజుల్లో... అక్షర శ్రీ యాజమాన్యం చాలా తక్కువ ఫీజుతో మా పిల్లలకు అద్భుతమైన చదువుని అందించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆర్థికంగా మాపై ఎలాంటి భారం పడకుండా, ఇంత మంచి ర్యాంకులు సాధించేలా చేసినందుకు కళాశాల యాజమాన్యానికి మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము" అని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# భారీ వర్షానికి కోతకు గురైన రహదారి





**వై రామవరం పెన్ పవర్, జూన్ 17**: మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి బూరుగుపాలెం, పులుసు మామిడి గ్రామాల మధ్య రహదారి కోతకు గురై భారీ గండి ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు.

మండలంలో దాలిపాడు పంచాయతీ బూరుగుపాలెం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రహదారికి గండి పడిందని తెలిపారు. ఈ రహదారి మీదుగా ములగలపూడి గ్రామానికి భారీ వాహనాలతో రహదారి నిర్మాణానికి చిప్స్ పట్టుకొని వెళ్లారని అంటున్నారు. భారీ వాహనాలు ఈ రహదారిలో ప్రయాణం చేయడం వల్ల రోడ్డు కృంగిపోయిందని, బుధవారం కురిసిన భారీ వర్షానికి రహదారి కొట్టుకొని పోయి గండి ఏర్పడిందని తెలిపారు. ఈ గండి వల్ల ఈ రహదారిలో ఏ విధమైన వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని గ్రామస్తులు అంటున్నారు. వాహనదారులు ఆదమరచి ఈ రహదారి పై ప్రయాణిస్తే ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్థలంలో గతంలో వాహనదారుడు గోతిలో వాహనంతో పడిపోయాడని స్వల్ప గాయాలతో బయటపడ్డాడని తెలిపారు. ఈ రహదారి నిర్మించేటప్పుడు సేఫ్టీ వాల్ కట్టవలసిన ఆవశ్యకత ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఇకనైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణం ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ విద్యాలయాలు



**వి.ఆర్.పురంపెన్.పవర్.జూన్.17** :ప్రవేట్ పాఠశాలకు,ధీటుగా ప్రభుత్వ విద్యాలయాలు విద్యాఅభివృద్ధి కల్పనలో అన్ని ఫలితాల్లో అగ్రగామిగా ఉన్నాయని,వి.ఆర్.పురం జిల్లా పరిషత్,ఉన్నత పాఠశాల లోవిద్యార్థుల,తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన విద్యలో ఏవిధంగా ముందుకు వెళ్లాలి.అనే అంశాలపై పలు చూచనలు చేశారు.ఈ అవగాహన కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రజయ్ కుమార్ పాల్గొని,మాట్లాడారు.పాఠశాలలో ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా మౌలిక సదుపాయాలు అదనపు తరగతి గదులు మెరుగైన క్రమ శిక్షణ,విశాలమైన పాఠశాల ప్రాంగణం వి.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొంతం అని అన్నారు. పిల్లలు చదువులు కేవలం ఒక్క ఉపాధ్యాయు లు మాత్రమే కాదని వారి విద్యా అభివృద్ధిలో తల్లిదండ్రు లు బాధ్యత కూడా అవసరం ఉందని గుర్తించాలని,హెచ్ ఎం సూచించారు.ప్రవేట్ పాఠశాలకు రాని పలితాలు ప్రభుత్వ విద్యాలయాలు నూటికి నూరు శాతం ప్రథమ స్థానంఉంటుందని,ప్రభుత్వపాఠశాలలో చదివే అవకాశం ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని,కోరారు.విద్యార్థులు భవిషత్ ప్రణాళిక బోధన విధివిధానాలు పై ఉపాధ్యాయు లు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి,రాజేశ్వరి అనురాధ,సత్తి బాబు ప్రసాద్,సుబ్బారావు,రాజేష్,చైతన్య,అన్వర్ శ్యామ ల శ్రావణి,నవీన్,కృష్ణ,రమేష్, ఎస్.చంద్రరావు,శిరోమణి, సిబ్బంది.విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొ న్నారు.

## హుటాత్తుగా పిడుగుపడియాబైఏడుమేకలుమృతి



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.17:** బుధవారం మధ్యాహ్నం హుటాత్తుగా గాలి,వర్షం,వేగంగా రావడంతో,పిడుగుకూడాపడి,యాబైఏడుమేకలువ్రుతిచెందడంజరిగింది.వివరాలుఇలా ఉన్నాయి.మండలంలోని కొప్పల్లి,గ్రామానికి చెందిన కారంసీతారామయ్య,సీతయ్య మారయ్య,ఉయికలక్ష్మయ్య,సరియంలక్ష్మయ్య,ఆసు సినమ్మిల మేకలు పిడుగుపాటుకు సుమారు57మేకలు మృతి చెందడంతో,మేకలకు సంబందించిన గిరిజనులు ఆందోళనలో,పడ్డారు.గాలి,వర్షం,వేగంగా,రావడంగమనించినమేకలకాపరి,కారంసీతారాయ్య,కొంచెంద ూరంగా వెళ్ల ఉండడం తో పెనుప్రమాదం తప్పిది.ప్రాణనష్టంజరగలేదు.మృతి చెందిన,మేకలుఐదుగురుగిరిజనులవి,గాగుర్తించారు. మృతిచెందిన మేకలకుప్రభుత్వం నష్టపరిహారంఇచ్చి,అన్ని విదాలుగాకాపరులను,ఆదుకోవాలని,మేకలకాపరులు ప్రభు త్వాన్ని కోరుతున్నారు.

## క్రీడాకారుడికి వైద్య సహాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 17:**

క్రీడాకారుడికి అత్యవసర చికిత్స కోసం శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ వైద్య సహాయం చేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం కడకట్ల,32వార్డుకు చెందిన ప్రసన్నకుమార్ కు వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.1,20,000 లకు ఎల్.ఓ.సి.ఇచ్చి ఆదుకున్నారు. ఇటీవల ప్రసన్నకుమార్ క్రికెట్ టోర్నమెంట్ లో ఆడిన సమయంలో అతనికి ప్రమాదవశాత్తు కాళ్ల కు గాయాలయ్యాయి.

లిగమెంట్లు దెబ్బతినడంతో అత్యవసర వైద్యం చేయవలసి వచ్చింది. జనసేన నాయకుడు రామిశెట్టి సురేష్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి వైద్యం నిమిత్తం ఎల్ఓసి ఇప్పించారు. ఆపదలో ఉన్న తనకు తక్షణమే స్పందించి వైద్య సహకారం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టికి శ్రీనివాస్ కు ప్రసన్నకుమార్ కుటుంబ సభ్యులు,మిత్రులు, కడకట్ల యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంలోనే నలుగురుకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలుకు తాడేపల్లిగూడెం మండలం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 17:**యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలు భీమవరం స్థానిక అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపం లో మంగళవారం జరిగాయి ఈ పోటీలలో తాడేపల్లిగూడెం కి చెందిన పాలూరి చిరంజీవి, పాలూరి అభినందిని జూనియర్ విభాగం లో ప్రథమ స్థానం,యంగ్ విభాగం లో కామన విజయ్ (కూనవరం)తోట లక్ష్మి ప్రథమ స్థానం, సీనియర్ విభాగం లో శెట్టి శ్రీనివాస్, తెంటు చిట్టెమ్మ, ప్రథమ స్థానం,గ్రూప్ విభాగం లో ఇబ్బా హేమ(మోదుగగుంట) మరియు యర్రంశెట్టి ఉషశ్రీ ప్రథమ స్థానం సాధించారు వీరు ఈ నెల 18,19 విజయవాడ లో జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలు లో పాల్గొంటారు వీరిని మరియు వీరికి శిక్షణ ఇచ్చిన నేషనల్ యోగ కోచ్, మోదుగగుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బదుగు చంద్రశేఖర్ ని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు మరియు మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ వి. చంద్రశేఖర్ అభినందించారు.

# ఘనంగా యోగా సాధన కార్యక్రమం



**చింతూరు, పెన్ పవర్, జూన్ 17:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 14 రోజుల యోగా సాధన కార్యక్రమంలో భాగంగా పోలవరం జిల్లా మోతుగూడెం డ్యామ్ వద్ద బుధవారం యోగా సాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 45 వేల మంది యోగా కార్యక్రమాలకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల ప్రాచుర్యానికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. జూన్ 9న మారేడుమిల్లి వుడ్స్ రిసార్ట్స్‌లో యోగా నిర్వహించగా, బుధవారం మోతుగూడెం డ్యామ్ వద్ద యోగా సాధన చేపట్టినట్లు తెలిపారు. పోలవరం జిల్లాలో అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని, పలు ప్రముఖ చిత్రాల చిత్రీకరణ కూడా ఈ ప్రాంతాల్లో జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యోగాను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో జిల్లా, మండల, గ్రామ, సచివాలయ స్థాయిల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉపాధి హామీ కార్మికులు, విద్యార్థులు, గిరిజనులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నెల 21న రంపచోడవరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగా గురువు ఆధ్వర్యంలో యోగా ప్రోటోకాల్ ప్రకారం 45 నిమిషాల పాటు యోగా సాధన నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సబ్ కలెక్టర్, ఐటిడిఏ పీవో శుభం నొక్వాల్, ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా, ఏఎస్పీ బి. హేమంత్, డీఎఫ్ఓ శివకుమార్ గంగల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వి. గాంధీబాబు, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ పి. సరిత, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులు సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తాను

-జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ఏలూరు జూన్ 17 పెన్ పవర్:** జిల్లాలో తొలిసారి జాయింటు స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింద జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం జాయింటు స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. ఏపి ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.ఎస్. హరనాథ్, ఏలూరు తాలుకా అధ్యక్షులు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి గంటా చంద్రశేఖర్, జిల్లాకోశాధికారి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. 12వ పి ఆర్ సి కమిషన్ ను ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ఇవ్వాలని, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అన్నారు. పెండింగులో ఉన్న డి ఏ లని విడుదల చేయాలని, గత ప్రభుత్వం నుంచి పెండింగులో ఉన్న సరెండర్ లీవ్ క్యాష్ నో ఇప్పించాలని, సీపీస్ విధానాన్ని రద్దు చేసి ఓపీస్ విధానం అమలు చెయ్యాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు వ్యవస్థను క్రమబద్ధీకరణ చేయాలని హెచ్ ఆర్ పాలసీని అమలు చేయాలని, హెల్త్ కార్డ్స్ ద్వారా క్యాష్ లెస్ ట్రీట్మెంటు కార్పోరేటు హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందించాలని అన్నారు.మహిళలుకి కార్యాలయంలో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని,ఆర్ టి సి ఉద్యోగులుకి వచ్చేరాయితీలు సకాలంలో వచ్చే ఏర్పాటు చేయాలన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణవార్డు ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యాలయాల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చెయ్యాలని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో 1999లో అన్ని కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు 20 శాతం బడ్జెటుని వీటి కోసం సంబంధిత శాఖ నుంచి వాడుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టరు ఇచ్చే ఆదేశాలు కింద స్థాయిలో జిల్లా అధికారులు సరైన రీతిలో ఉద్యోగులు పట్ల చూపించకుండా వ్యవహరిస్తున్న తీరుని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. పనిచేసే సిబ్బందికి మెరుగైన పరిపాలనా దక్షత, సామర్థ్యం పెంపు కోసం జిల్లా ట్రైనింగు సెంటరుని మళ్ళీ పునరుద్ధరణ చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధికి జిల్లా కలెక్టరు మరియూ జిల్లాయంత్రాంగం చేసే ప్రతి కార్యక్రమంలో ఉద్యోగులు పాలు పంచుకుని సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టరుకు శ్రీనివాస్ హామీ ఇచ్చారు.వివిధసంఘాలు అధ్యక్షులు జిల్లా కలెక్టరుకు వినతి పత్రాలను ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్గాడుతూ ఉద్యోగ సంఘాలు అధ్యక్షులు, సభ్యులు లేవనెత్తిన ప్రతి సమస్యను అవగాహనచేసుకున్నానని అన్నారు. ఉద్యోగులు సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన పరిధిలో లేనివి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్వో ఎల్.దేవకీదేవి, జెడ్పీ సిఈవో పి. జగదాంబ, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, డిసిహెచ్ఎస్ డా.సి.హెచ్.బేబికమల, డీపీవో జి. మల్లిఖార్జున రావు, జిల్లా ప్రజా రవాణాధికారి యస్.కె.షబ్నమ్, వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు నాయకులు. కె.రమేష్ కుమార్, ఏ.ప్రమోద్ కుమార్, పువ్వుల ఆంజనేయులు, పి.నారాయణ, కె.పవన్, మోహన్, రామారావు, కప్పల సత్యనారాయణ, రంగమోహన్, లీలా రాణి, దయావతమ్మ, సత్య భారతి, కృష్ణవేణి, కట్టా కనకరాజు, గోపాల కృష్ణ, నాగభూషణం, యాసలపు శ్రీను, సోదిమెల్ల శివ, జిల్లా అధ్యక్షులు సురేష్, కార్యదర్శి శ్రీధరు, టౌన్ ప్రెసిడెంటు ఆనంద్, వైస్ ప్రెసిడెంటు తవుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధీర ప్రసాద్

- రైతులు ముందుకు రావాలని పిలుపు
- తాళ్లూరు రైతులు పామాయిల్ తోట పెంపకంలో జిల్లాకి ఆదర్శం కావాలని హితవు






**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 17:** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో నిర్వహించిన ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధీర ప్రసాద్ ఆయిల్ పామ్ మొక్కను నాటి ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, దేశీయ వంటనూనెల అవసరాలను తీర్చడంలో ఆయిల్ పామ్ సాగు కీలక పాత్ర పోషిస్తుందని, రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే పంటగా ఆయిల్ పామ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నీటి వసతి ( బోరు ,బావులు) తో వరి పంట పండిడిస్తున్న రైతులు అందరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. తాళ్లూరు గ్రామం 30 మంది రైతులు ఈ సంవత్సరం 60 ఎకరాల ఆయిలపామ్ పంట సాగుకు తో పంట మార్పిడి చేసుకున్నారు అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆయిల్ పామ్ మొక్కను నాటి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రైతులతో ముఖాముఖి సమావేశమై ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు, సాగు విధానాలు మరియు ప్రభుత్వ సహాయ కార్యక్రమాల గురించి వివరించారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి టీ .వీర సిరిల్ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సహాయం మరియు అంతర పంటల ప్రోత్సాహకాలు, గురించి రైతులకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఏ.శ్రీవల్లి ఏడిఏ , జి .శ్రీనివాస్ ఎంపీడీవో, సత్య హరి కృష్ణ రెడ్డి, తహసీల్దర్ కె.పద్మజ పతంజలి ఫుడ్స్ టివి ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ పామ్ సంస్థల ప్రతినిధులు హెడ్ ప్లాంటేషన్స్ వి, పాటభి రామి రెడ్డి, ఏజీఎండి . రవీంద్ర, ప్రజాప్రతినిధులు పైని వెంకటేశ్వరావు, పాలచర్ల సత్యనారాయణ, కొండ్రు అప్పలరాజు, ఎంపీటీసీ చెల్లూరి. రాంబాబు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గోదావరి మహా పుష్కరాలు-- 2027కు రూపొందించిన ప్రణాళికలు ఆచరణలోకి వచ్చేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలి






- భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన పుష్కర అనుభవం కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 17:** గోదావరి మహా పుష్కరాలు -- 2027 నిర్వహణకు సంబంధించి రూపొందిస్తున్న అన్ని ప్రణాళికలు క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యమయ్యేలా స్పష్టమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం బొమ్మూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గోదావరి మహా పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమమని పేర్కొన్నారు. ఘాట్ల అభివృద్ధి, రవాణా నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, పుష్కర్ నగర్ల ఏర్పాటు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విజయవాడ వైపు నుంచి వచ్చే రైళ్లను కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో, విశాఖపట్నం వైపు నుంచి వచ్చే రైళ్లను గోదావరి రైల్వే స్టేషన్‌లో నిలిపే అవకాశాలను పరిశీలించి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే శాఖ అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ఆర్టీసీ బస్సులు రానున్నాయి, వాటి పార్కింగ్ కోసం ఎక్కడెక్కడ స్థలాలు గుర్తించవచ్చనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పుష్కరాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, రియల్‌టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు, సీసీటీవీ నిఘా, డ్రోన్ పర్యవేక్షణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన వ్యవస్థలను ముందుగానే అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనంతరం చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ బృందం గోదావరి మహా పుష్కరాలకు సంబంధించి రూపొందించిన మొబిలిటీ ప్లాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సమావేశంలో ప్రదర్శించింది. గత నెలలో రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో పర్యటించిన బృందం ఘాట్లు, రవాణా మార్గాలు, ఖాళీ స్థలాలు, పార్కింగ్ ప్రాంతాలు, పుష్కర నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రూపొందించిన నివేదికను సమావేశంలో వివరించింది. పుష్కరాల సందర్భంగా ఒకే రోజు గరిష్టంగా 66 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మొబిలిటీ ప్రణాళిక రూపొందించినట్లు బృందం తెలిపింది. కొవ్వూరు మండలం వాడపల్లి ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న చిన్న చిన్న ఘాట్లను ఏకీకృతం చేసి సుమారు రెండు కిలోమీటర్ల పొడవున తాత్కాలిక ఘాట్‌ను అభివృద్ధి చేస్తే అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవకాశం ఉంటుందని వివరించింది. నదీ తీర పరిరక్షణతో పాటు ఘాట్ల స్థిరీకరణ కోసం గాబియన్ బాస్కెట్లు, రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని ప్రతిపాదించింది.
జిల్లాలో ప్రధానంగా 11 ఘాట్లను అభివృద్ధి చేస్తే రోజుకు సుమారు 63 లక్షలకు పైగా మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగల సామర్థ్యం ఏర్పడుతుందని బృందం వివరించింది. కొవ్వూరు వైపున వాడపల్లి--శివాలయం--సుమా స్కూల్ ఘాట్, గోష్పాదక్షేత్రం ఘాట్, శ్రీనివాస--వెరినమ్మ ఘాట్, ఔరంగాబాద్ ఘాట్, స్పెక్ ఘాట్, గౌతమి దండగుండ ఘాట్‌లను, రాజమహేంద్రవరం వైపున కోటిలింగాల ఘాట్, పుష్కర్ ఘాట్, కాతేరు వీఐపీ ఘాట్, ధోబీఘాట్--సరస్వతి ఘాట్--అయ్యప్ప ఘాట్ సముదాయం, గాయత్రి ర్యాంప్ ఘాట్‌లను ప్రధాన ఘాట్లుగా గుర్తించినట్లు తెలిపింది.
రాజమహేంద్రవరం వైపుతో పోలిస్తే కొవ్వూరు వైపున ఘాట్ల సామర్థ్యం అధికంగా ఉన్నందున భక్తుల రద్దీని సమతుల్యం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించింది. అలాగే 11 ప్రధాన ఘాట్లకు అనుసంధానంగా 23 పుష్కర్ నగర్లను సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసి వాటిని భక్తుల హోల్డింగ్ ఏరియాలుగా వినియోగించాలని ప్రతిపాదించింది. ఈ పుష్కర్ నగర్లలో ఆహారం, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, పార్కింగ్, షటిల్ బస్సు సదుపాయాలు ఏర్పాటు చేసి భక్తులను దశలవారీగా ఘాట్లకు తరలించడం ద్వారా రద్దీని సమర్థవంతంగా నియంత్రించవచ్చని వివరించింది.
భక్తుల రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రత్యేక బస్ టెర్మినళ్లు, షటిల్ బస్సు మార్గాలు, పాదచారుల కోసం ప్రత్యేక మార్గాలు, రైల్వే స్టేషన్ల వద్ద అదనపు ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల నిర్వహణ కోసం ప్రత్యేక కారిడార్లు, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, సీసీటీవీ నిఘా, ఆధునిక క్రౌడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. సమావేశంలో సీయూఎంటిఏ బృందం ప్రతిపాదించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి వాటి సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఘాట్లు, పుష్కర్ నగర్లు, రవాణా నిర్వహణ, భక్తుల రాకపోకల నియంత్రణ, అత్యవసర స్పందన వ్యవస్థలపై సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డి.ఆర్.ఓ భాస్కర్ రెడ్డి, సియూఎంటిఏ బృందం సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సిహెచ్సి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ప్రసాద్


- హాస్పిటల్ నిర్వహణ బేస్
- పోస్టుమార్టం వద్ద ఫ్రీజర్ బాక్స్ సౌకర్యం కల్పిస్తాం
- ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం జిల్లా కలెక్టర్






**గండేపల్లి,పెన్ పవర్,జూన్,17**
జిల్లా పర్యటనలో భాగంగా గండేపల్లి మండలం జెడ్ రాగంపేట పరిధిలో ఉన్న జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రి అని కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ బుధవారం అకస్మక తనిఖీ నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ప్రణీత్ ను ఆసుపత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిహెచ్ లోని వివిధ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు అక్కడ వారికి అందుతున్న వైద్య సదుపాయాలను కడిగి తెలుసుకున్నారు. అలాగే జాతీయ రహదారికి దూరంగా ఆసుపత్రి కొనడంతో వచ్చే రోగలకు ఇబ్బంది కలగకుండా త్వరలోనే ఆర్టీసీ రిక్వెస్టర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పోస్టుమార్టం వద్ద రేజర్ బాక్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఆసుపత్రి లో అంబులెన్స్ అందుబాటులో ఉండే విధంగా సర్వేలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది కొరతను త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రి నిర్వహణ చాలా అద్భుతంగా ఉందని ప్రజలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రి వలే ఉందని కాన్పులు కూడా ఇక్కడే జరుపుతున్నట్లు తెలిపారని ఆయన అన్నారు. ఈయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

# నీట్ అభ్యర్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం



**రాజమహేంద్రవరం/రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 17:** ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పరీక్ష రాసే అభ్యర్థులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి వై.ఎస్.ఎన్. మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు డిపోలతో పాటు పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరం, గోకవరం డిపో బస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ స్టేషన్లలో సహాయక సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని నీట్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

